# అదో కథ!



## పెనుమాక నాగేశ్వరరావు

కథలు చదవటమే గాని రాయడం అలవాటు లేదు నాకు. కాని ఎందుకో ఇప్పుడు ఒకే ఒక్క కథ రాయాలని మహా కోరికగా వుంది. అంతటి కోరిక కలగటానికి కారణం నాకు అతని మీద ఏర్పడిన కసి, కోపం. అతనొక్కడి మీదనే కాదు అలాంటి వారందరి మీదా కోపం.అందుకే అతన్ని అతని ప్రవృత్తిని ఈసడించుకుంటూ అసహ్యం కలిగేటట్లు ఓ కథ రాసి ఎలాగోలా ఆ కథ అతని చేత చదివించాలని విపరీతమైన పట్టుదల కలిగింది. ఆ పట్టుదల పెరిగి పెరిగి పంతంగా మారింది. అతని మీద ఇలా ప్రతీకారం తీర్చుకోవాలనిపించింది. అందుకే మొట్ట మొదటిసారిగా నేను ఓ కథ రాశాను.

ఎలాగయినా సరే ఈ కథ ఓ వార పత్రికలో ప్రచురణ కావాలి. అది అతని కంట పడాలి. అది చదివి, అతను సిగ్గు పడాలి. అంతేకాదు అతని మూలంగా నేను నష్టపోలేదని, పైగా లాభించానని అతనికి తెలియచెయ్యాలి. అప్పుడు కానీ నా కసి కొంతైనా తీరదు., నాకు జరిగిన అన్యాయానికీ, అవమానానికీ కొంతైనా ఉపశమనం కలగదు. ప్లీజ్ కథలు రాయటంలో నీకు కొంత అనుభవం వున్నది కాబట్టి ఈ కథ ఎలా మొదలు పెట్టాలో నేను చెప్పదలుచుకున్న విషయం ఏ రకంగా రాసి ఎలా ముగించాలో చెప్పు. ఇంకెప్పుడూ కథ రాయను. ఈ ఒక్కటే''

నరసరాజు నన్ను అడిగిన తీరు ఆశ్చర్యంతో పాటు ఆసక్తిని కూడా కలిగించింది నాకు.

''ఏమిటీ నువ్వు కథ రాశావా?'' ఆసక్తి కనబరుస్తూ అడిగాను నేను.

''అవును, నా ఆలోచనకూ, ఆవేశానికీ తగినట్లు ఇదిగో ఈ పత్రిక వారు 'లంచం' అనే అంశం మీద కథల పోటీ పెట్టారు. ఈ కథ ఆ పోటీకి పంపించాలను కుంటున్నాను. నా కథకు తప్పకుండా మొదటి బహుమతి లేదా కనీసం రెండో బహుమతి అయినా రావాలి. అప్పుడు గానీ నేను అతనికిచ్చిన లంచం కంటె ఎక్కువ సొమ్ము రాదు నాకు. అలా వస్తేనే తప్ప నేనతన్ని ఎదుర్కోలేను''

''నువ్వు ఎవరివయినా నాకు అనవసరం. మాకు ఇవ్వాల్సిన మామూలు మాకు ఇస్తేనే కానీ, ఏ పని కాదు. దాన్ని గురించి వేరే ఆలోచనలేం వుండవు అంటూ లంచం కోసం డిమాండ్ చేస్తాడా? అవసరాన్ని ఆసరాగా తీసుకుని ఆడుకుంటాడా. కనీసపు మర్యాద కూడా కనపరచకుండా ఏ మాత్రం పరిచయమూ లేని నన్ను ఏకవచన ప్రయోగం చేస్తాడా? అసలు లంచం తీసుకోవడం వాడి జన్మ హక్కులా మాట్లాడతాడా. నో... నేను సహించలేను. అతన్నే కాదు, తనలాంటి వారి నెవ్వరినీ సహించను. లంచం తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వటమూ అంతే నేరమే. కాదనను. కాని ఎలా? లంచం ఇవ్వకుండా అతను లంచగొండి అని నిరూపించలేను. ఇచ్చిన తర్వాత ఆ ప్రయత్నం చేస్తే నాదీ తప్పు అవుతుంది. అయినా అధికారుల అండదండ లున్న అలాంటి వారికి శిక్ష వేయించడం, చట్ట ప్రకారం నేరస్తుడిగా నిరూపించడం అంత తేలిగ్గాదు. అతని మనసు మీద దెబ్బకొట్టాలి. అతని అంతరాత్మ అతన్ని హింసించాలి. అదీ... అది ... నా కోరిక... అందుకే ఈ ప్రయత్నం''

అతని ఆవేశాన్ని అలకిస్తూనే కథ చదవడం పూర్తి చేశాను.

''మొదటి ప్రయత్నమే అయినా చాలా చక్కగా వ్రాయగలిగావ్ రాజా. కంగ్రాట్స్'' అంటూ చేయి చాచాను.

''థ్యాంక్స్'' అంటూ కరచాలనం చేశాడు రాజా.


''నీ ఆవేదన నాకు అర్థం అయింది. నీవు ఎంతగా అవమానించబడ్డావో, ఆ వ్యక్తి ఎంత అమానుషంగా, అక్రమంగా ప్రవర్తించాడో అర్థం అవుతూనే వుంది. కానీ...''

''సందేహించకుండా చెప్పు... ఏమైనా మార్పులు చేర్పులు అవసరం అయితే తప్పకుండా చేద్దాం. అందుకే గదా నీకు చూపించింది''

''నో... నో... ఆ అవసరం ఏమీ లేదు. కథ, కథనం అన్నీ ఒ.కే. కానీ... ఈ కథ రాయటంలో నీ కోరిక తీరినట్టు కాదు కదా...''

''అవును. నా కథకు బహుమతి రావాలి. అప్పుడు నేనే అతని దగ్గరకు వెళ్ళి ఈ కథ చదివించి, నీవు నా దగ్గర అక్రమంగా తీసుకున్న లంచానికి ప్రతిఫలంగా నాకు ఈ రూపంగా ఇదిగో ఇంత ముట్టింది అని చెప్పాలి. అంతేకాదు అతను కథ చదివేటప్పుడు పడే కలవరపాటును కళ్లారా చూసి ఆనందించాలి. అంతే. అతన్లో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించినా చాలు. అంతకంటే నేను ఏం కోరుకోను''

''కథయితే బాగానే రాశావు కానీ, మిగిలిన విషయా లన్నీ చాలా అమాయకంగా మాట్లాడుతున్నావ్ నరస రాజా. కేవలం కథలు చదివి, సినిమాలు చూసి మనుషులు పరివర్తన చెందుతారని, పశ్చాత్తాప పడతారని అనుకోవటం అమాయకత్వం''



"అతను మారతాడో, మారడో నాకు అనవసరం. నాకు కావలసింది, నేను కోరుకునేది ప్రతీకారం. అందుకు నాకు ఇంతకంటే వేరే మార్గం లేదు. అంతే!" మొండిగా అన్నాడు వరసరాజా.

"సరే కథ బాగానే రాశావ్. పంపించు. బహుమతి రావడానికి యోగ్యత వున్న కథగానే అనిపిస్తున్నది నాకు. కాని సంపాదకవర్గానికి నచ్చాలి కదా! ఇంతకంటే బాగా రాసిన వారూ పోటీకి పంపి వుండవచ్చు. ఏది ఏమైనా విష్ యు ఆల్ ది బెస్ట్" అన్నాను. ఉత్సాహంగా కథ చేత పుచ్చుకుని వెళ్ళిపోయాడు వరసరాజా.

*　　*　　*　　*

"బాస్ నా కథకి రెండో బహుమతి వచ్చింది. అయామ్ వెరీ హేపీ. ఇదిగో ఇప్పుడే లెటర్ వచ్చింది" అమితోత్సాహంతో చెప్పేడు వరసరాజా.

"వెరీగుడ్... యూ డిడ్ ఇట్" అన్నాను సంతోషంగా.

అతని సంతోషం అంతా తన మొదటి కథ ప్రచురణకు తీసుకోవటం, అదీ బహుమతి రావడం జరిగినందుకు కాదు, తన సంతం నెరవేరబోతున్నందుకు. మరో రెండు రోజుల్లో ఆ వార పత్రిక మార్కెట్‌లోకి వచ్చింది. వచ్చే సంచికలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన మూడు కథల్ని ప్రచురిస్తున్నామని, ఆయా రచయిత(త్రు)లు తమ ఫోటో వెంటనే పంపమని ప్రచురించారు.

వెంటనే తన ఫోటోతో పాటు స్వపరిచయ వాక్యాలు క్లుప్తంగా వ్రాసి పంపాడు వరసరాజా. అతని ఉత్సాహం చూసి ముచ్చటేసింది నాకు.



"వచ్చే వారం ఆ వీక్లీ రాగానే నన్ను కూడా పిలు. నీతో పాటు నేను కూడా అతని దగ్గరకు వస్తాను. ఇప్పుడెందుకో నాక్కూడా అతన్ని చూడాలని అనిపిస్తున్నది" అన్నాను రాజాతో

"తప్పకుండా వెళ్దాం. ఈ కథ నీ ఒక్కడితే కాదు, నీలాంటి వాళ్లందరిదీ. నీలాంటి నీ మిత్రులందరికీ కూడా చూపించు , వాళ్ళ చేత కూడా చదివించు అని చెప్తాను. అసలు కథ చదివాక నీ మాత్రమైనా సిగ్గు పడ్తాడో లేదో చూడాలి. అసలు అతని పేరు నాకు తెలియదు. లేకపోతే కథలో ఆ పేరే వాడుకునేవాణ్ణి" నవ్వుతూ అన్నాడు వరసరాజా.

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి. ఆ రోజు ఉదయాన్నే వరసరాజా మా ఇంటికి వచ్చి వీక్లీ ఎప్పుడు వస్తే అప్పుడు నా దగ్గరకు వస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

పన్నెండు గంటలప్పుడు పరుగెత్తుకుంటూ వీక్లీ వూపుకుంటూ ఆఫీసుకు వచ్చాడు వరసరాజా. అతని కథ పడిన పేజీ దగ్గర వేలుంచాడు. నా దగ్గరకు రాగానే పుస్తకం తెరచి చూపించాడు. అతని ఫోటో, స్వపరిచయం కూడా వేశారు. వరసరాజా రచయిత అయినందుకు నాకు సంతోషంగా వుంటే తన కోరిక నెరవేరుతున్నదని అతను ఆనందపడిపోతున్నాడు. ఇద్దరం కలిసి సదరు వ్యక్తి దగ్గరకు వెళ్ళాం.

మమ్మల్ని చూస్తూనే చూస్తున్న ఫైలుని మరింత సీరియస్‌గా, సిన్సియర్‌గా చూస్తున్నట్లు నటించాడు. బహుశా అతన్తో మళ్లీ పని పడి వచ్చాం అనుకునుంటాడు పాపం.

"యుక్స్యూజ్ మి... మీతో కాసేపు మాట్లాడాలి" అన్నాడు వరసరాజా.

"మీ పని కంప్లీట్ అయిందిగా" అనుమానంగా అన్నాడతడు.

"నో... నో దాన్ని గురించి కాదు. పర్సనల్ మేటర్" అన్నాను నేను కలుగచేసుకుని.

"చెప్పండి"

"మీకు కథలు, నవలలు చదివే అలవాటు వుండే వుంటుంది. ఒకవేళ లేకపోయినా ఇదిగో ఈ పుసక్తంలో అచ్చయిన నా మొదటి కథ మీరు తప్పక చదివి తీరాలి" అంటూ పుస్తకం తెరచి అతని ముందుంచాడు వరసరాజా.

"కంగ్రాట్స్. మీరు రచయితన్నమాట" నవ్వుతూ అన్నాడతను.


"ఈ కథకి ప్రేరణ మీరే. మీ మూలంగా నాకు ఆర్థిక లాభం చేకూరింది. పైగా కథంతా మీ గురించే" వ్యంగ్యంగా అన్నాడు వరసరాజా.

అతని ముఖం గంభీరంగా మారిపోయింది. ఆసక్తిగా కథనంతా చదివాడు.

వరసరాజా, నేనూ సిగరెట్ కాల్చుకుంటూ అతని వైపే పరిశీలనగా చూస్తూ కూర్చున్నాం.

"కథ చాలా బాగా రాశారు. బైది బై నా పూర్తి పేరు ........ ఇదే పుస్తకంలో ఈ కథల పోటీలో ప్రథమ బహుమతి గ్రహీతను నేనే. ఫోటో పంపే అలవాటు లేక పంపలేదు" నవ్వుతూ చెప్పేడు అతను.

కొయ్యబారిపోయాడు వరసరాజా. ●



ప్రతిభ

